యుగధర్మం

సాయంత్రం అయిదు దాటినా, వడగాడుపు తగ్గలేదు. రోజల్లా శ్రమించి పని చేసిన తర్వాత, అంతటి వేడిలో ఇంటికి వెళ్ళాలంటే నిజంగా ప్రాణం పోతుంది. స్కూటర్ పాడవడం వల్ల బాగుచేయడానికి యిచ్చాను. సోమవారం నాడు కాని అది తయారవ్వదు. సిటీ బస్సులు పేరుకే కాని, సమయానికి రావు. వచ్చినా, విపరీతమైన రద్దీ. ఆఫీసు వదిలి, కాలినడకను ఇంటి దారి పట్టాను.

"రిక్షా కావాలా సార్," ఓ రిక్షా అతను పక్కగా వచ్చి అడిగాడు.

"దానవాయిపేటకి ఏం కావాలి?" ప్రశ్నించాను. నాలోని నీరసాన్ని కనిపెట్టి ఉండాలి. "రెండు రూపాయలిప్పించండి", అన్నాడతను.

"ఆశకంతుండాలయ్యా! దానవాయపేటకి రెండు రూపాయలా?"

"చదువుకున్న బాబులు - మీరే ఇలా అంటే ఎలా? ఎంత గాడుపుగా ఉందో చూడండి. అందులోనూ అంతా మెరక లాగాలి", అన్నాడతను.

నా జేబులో సరిగ్గా రెండు రూపాయలే ఉన్నాయి. ఉదయం ఆఫీసుకు వెళ్ళేటప్పుడు పర్సు నిండుగానే ఉంది. అవసరంగా ఉందంటే ఆఫీసు జీప్ డ్రైవర్‌కి ఏభై యివ్వగా రెండు రూపాయలు మిగిలాయి. అతగాడు డబ్బు తీసుకొని, నెమ్మదిగా అన్నాడు-'మీ స్కూటర్ పాడై పోయిందనుకొంటాను. సాయంత్రం మిమ్మల్ని ఇంటి దగ్గర దిగబెడ్తాను'

అతగాడి సన్నాయి నొక్కులకి నాకు చిర్రెత్తుకొచ్చింది.

"ఆఫీసు జీపుని నా స్వంత పనులకు ఉపయోగించనని నీకు తెలుసు. ఇక్కణ్ణించి వెళ్ళు!" అని కసిరాను.

"ఎందుకు సార్ అలా కోప్పడ్తారు? పెద్దమ్మగారు (ఇంజనీరుగారి భార్య) షాపింగ్‌కు వెడ్తారట. జీప్ తీసుకుపొమ్మని అయ్యగారు చెప్పారు. జీప్ ఎలాగా అటువైపు వెళ్ళాలికదా, మిమ్మల్ని దింపవచ్చునూ అని...." అని నసిగాడు. అతగాడి మాటలు నాలో మార్పుని తీసుకురాలేదు. నేను సమాధానం యివ్వకపోవటంతో, "మీ యిష్టం" అంటూ వెళ్ళిపోయాడు.

"ఏం బాబయ్యా, ఏమంటారు?" అన్న రిక్షా అతని మాటలతో ఈ లోకంలో పడ్డాను.

'రెండు రూపాయలు చాలా ఎక్కువ. మరో బేరం చూసుకో" అన్నాను. అతను నిజంగానే మరో బేరం చూసుకొన్నాడు. చలవ కళ్ళజోడు పెట్టుకొన్న ఓ వన్నెలాడి, "ఏయ్ అబ్బీ, దానవాయిపేట రిక్షా కడ్తావా?" అని అడిగింది.

'రెండు రూపాయలు" అన్నాడతను.

"ఎవరైనా నవ్విపోతారు! రూపాయిస్తాను" ఆమె నిక్కచ్చిగా అనేసింది.

"సరే, రండి!"

ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాను. ఆమె రిక్షాలో కూర్చోగానే హుషారుగా అతగాడు రిక్షా తొక్కుకుంటూ వెళ్లిపోయాడు. షివర్లీ అనేది ఒక్క చదువుకొన్న వాళ్ళ సొత్తే కాదు- మగవాడికి పుట్టడంతో వచ్చే గుణాల్లో ఇదొకటనుకుంటాను.

స్కూటర్ సుఖానికి అలవాటుపడ్డ ప్రాణం, నడవడానికి ఒప్పుకోవడం లేదు. గాస్ అయిపోయిన తర్వాత, సిలెండర్ మళ్ళీ వచ్చేవరకూ - మా ఆవిడ విసుగుకీ, కోపానికీ అర్థం లేదని ఎన్నోసార్లు అంటూంటాను. "ఓ రెండు పూటలు కిర్సనాయిలు స్టవ్ మీద వండితే ఏంపోయింది?" అని ప్రశ్నిస్తే, "మీ స్కూటర్ పాడయితే, ఓ నాలుగు పూటలు నడిచి వెడ్తే మీకూ తెలుస్తుంది కష్టం" అంటుంది. ఆ మాటల్లో నిజం లేకపోలేదని అనిపించింది.

రిక్షా కోసం డబ్బులు ఖర్చుపెట్టడానికి మనసు ఒప్పుకోలేదు. వచ్చేపోయే రిక్షాల్ని, కార్లనీ తప్పించుకొంటూ, మురుక్కాలవల వాసనకి ముక్కు మూసుకొంటూ, జాంపేట జంక్షన్ చేరుకొనేసరికి, కాళ్లలో సత్తువపోయింది. గొంతుక తడారి పోయింది. అవసరమైన దానికన్నా ఎక్కువ ప్రాణాల్ని కష్టపెట్టినందుకు మనసులో నొచ్చుకొంటూ, కూల్‌డ్రింక్

షాపులో ఓ రూపాయి తగలెట్టి 'లిమ్కా' తాగాను. కొట్టు పక్కనే, రకరకాల ప్లాస్టిక్ బొమ్మలు ఓ బల్ల మీద పెట్టుకొని, "ఏ వస్తువైనా రూపాయి?" అంటూ ఓ నల్లబట్టలతను అరుస్తున్నాడు. బాబిగాడి కోసమని, ఓ మర బొంగరాన్ని తీసుకొని బయలుదేరాను. రిక్షా మీద అనవసరంగా ఖర్చు పెట్టడం కంటే ఇదే నయమనిపించింది.

గేటు తలుపు తోసుకొని, ఆవరణలో అడుగుపెట్టాను. యింటికి తాళం వేసి ఉంది. పుస్తకాల సంచి మల్లెపందిరి రాటకి తగిలించి, పందిరి కింద బాబిగాడు గొప్పులు తవ్వుతున్నాడు. పంపుకి తగిలించిన రబ్బరు గొట్టంలోంచి నీళ్లు పక్కనే ఉన్న గులాబి చెట్లని తడుపుతున్నాయి.

"అమ్మ ఎక్కడికెళ్ళిందిరా?" అని అడిగాను. తవ్వు గోల పక్కన పెడ్తూ, "నాకేం తెలుసు? స్కూల్ నుంచి వచ్చేసరికి తాళం వేసి ఉంది!" అన్నాడు బాబి.

"అక్క...?"

"అక్కా, నేనూ కలిసే వచ్చాం. యింటికి తాళం వేసి ఉండడం చూసి, సరళా వాళ్లింటికి గచ్చకాయలాడుకోడానికి వెళ్లిపోయింది!" బాబిగాడి గొంతుకలో, ఏదో కసి కొట్టవచ్చినట్లు కనబడింది. ఏమనాలో తెలియక ఊరుకొన్నాను. ఉండలేక, మళ్లీ వాడే అన్నాడు- "రాణిగారిలా ఊర్లమ్మట షికార్లు కొట్టడానికి శ్రమ ఉండదు. మొక్కలకి గొప్పులు తవ్వి నీళ్ళు పెడ్దామేఅంటే, ఓ వెకిలినవ్వు నవ్వేసి గచ్చకాయలాడ్డానికి చెక్కేసింది. పువ్వుల్ని మట్టుకు మొగ్గల్లోనే తుంపేసి తల్లో తురుముకోడానికి మట్టుకు తయ్యారు!"

"పువ్వులు వాళ్ళు పెట్టుకోకపోతే నువ్వు పెట్టుకొంటావట్రా! మరి ఈ పువ్వులు ఎవరి కోసమని?"

"దాని కోసం మట్టుకు కాదు. మన యింటి అందం కోసం! అయినా కొంచెం సాయం చెయ్యవచ్చునుగా?"

నాకు నవ్వొచ్చింది. బాబికి కోపం రెచ్చిపోయింది. నేను మర బొంగరాన్ని పైకి తీసి చూపించాను. బాబి కళ్లు మిలమిలా మెరిసాయి. మరబొంగరాన్ని వాడి చేతిలో పెడ్తూ, "నువ్వు పోయి దీంతో ఆడుకో. నేను మొక్కలకి గొప్పులు తవ్వుతాను", అన్నాను.

వాడి కోపం యిట్టే ఎగిరిపోయింది. బొంగరాన్ని తీసుకొని వరండాలోకి పరుగెత్తాడు.

ఓ అరగంట పోయిన తర్వాత సరోజ ఓ రిక్షాలోంచి దిగి వచ్చింది. వరండా మెట్ల మీద కూర్చున్న నన్ను చూసి నవ్వుతూ, "ఓ రూపాయుంటే ఇవ్వండి. రిక్షా అతనికి యివ్వాలి" అంది.

"లేదు!" అన్న నా ముక్తసరి సమాధానం విని, తెల్లబోయింది సరోజ. కాని తమాయించుకొని అన్నది, "పొద్దున్న ఆఫీసుకు వెళ్ళేటప్పుడు చాలా డబ్బే ఉండాలే?!"

ఈ విసురుతో నాకు వళ్ళు మండింది.

"నీకెలా తెలుసు? జేబులు తడమడం మొదలెట్టావా?" అన్నాను.

ఇంక మాట్లాడి లాభం లేదనుకొంది కాబోలు తలుపు తాళం తీసి లోపలికెళ్లింది. ఓ రూపాయి తీసుకొచ్చి, రిక్షా అతనికిచ్చి, గేటు తలుపు వేసి వరండాలోకి వచ్చింది.

''శాంత ఏదిరా బాబీ?'' వాణ్ణి ప్రశ్నించింది.

''నీలాగే, అదీ షికార్లకి వెళ్లింది'' కొంచెం కటువుగానే అన్నాను.

''వెంకటలక్ష్మిగారమ్మాయి హైద్రాబాద్ వెళ్ళిపోతోందని తెలిసి చూడ్డానికి వెళ్ళాను. కొత్తగా కాపురానికి వెడ్తోంది కదా, చూడకపోతే బావుండదు! తీరా వెళ్ళిన తర్వాత వాళ్ళు నన్ను ఓ పట్టాన కదలనివ్వలేదు. అందుకనే ఆలస్యం అయిపోయింది కదా అని రిక్షా మీద వచ్చేశాను''

''రెండు వీధులవతల్నుంచి యిక్కడికి రూపాయా రిక్షాకి?!''

''ఇంత గాడుపుల్లో వాళ్లు మట్టుకు తక్కువ బేరానికి వస్తారా? మీరెంత యిచ్చారేమిటి, ఆఫీసు నుంచి యింటికి రావడానికి?''

''నడిచి వచ్చాను''

డబ్బు విలువ నీకు తెలియదులే అన్న అర్థం వచ్చేటట్లుగా ఉంది కాబోలు నా సమాధానం - సరోజ చిన్నబోయిన మొహంతో లోపలికి వెళ్లింది.

నేనూ లేచి ముందుగదిలోకి పోయి, ఫాన్ వేసుకొని సోఫాలో కూలబడ్డాను. పేపర్ తీసుకొని చదవడం మొదలుపెట్టాను.

''ఉత్తరం వచ్చింది, మీకు-'' అంటూ సరోజ వచ్చి, ఓ కవరిచ్చింది.

''ఎక్కణ్నించి? ఎవరు వ్రాశారు?'' ప్రశ్నించాను. సరోజకు అవకాశం దొరికింది.

''నేనేమైనా విప్పి చదివానా- ఎవరు ఎక్కణ్ణించి వ్రాసిందీ తెలియడానికి? సరే, మీతోగొడవెందుకు కానీ, ఉత్తరం చదువుకోండి. ఈలోపులో కాఫీ తీసుకొస్తాను'' సరోజ లోపలికి వెళ్లింది.

కవరు చింపి ఉత్తరం చదివాను. సరోజ కాఫీ తీసుకొచ్చి, చేతికందిస్తూ ''ఎక్కణ్ణించేమిటి?'' అని కుతుహలంగా అడిగింది. ఓ క్షణం సందేహించాను. ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

''అక్కయ్య రాసింది. వాళ్ల శ్యామలకి పెళ్ళి కుదిరిందట. ఉన్న ఎకరం పొలం అమ్మేసినా, ఇంకా కట్నానికి రెండు వేలు తక్కువొచ్చిందనీనూ, ఎంత ప్రయత్నించినా ఆ డబ్బు సర్దుబాటు కాలేదనీనూ'' సరోజ మొహంలోకి చూస్తూ అన్నాను. కొంచెంగా రంగు మార్పు మొహంలో గమనించాను. సరోజ మౌనంగా ఉండిపోయింది.

'నాకు ప్రమోషన్ వచ్చిన తర్వాత నెలనెలా మనం ఆదా చెయ్యకలిగిన డబ్బు నీ పేర బ్యాంక్‌లో వేస్తున్నాను కదా. అది ఈపాటికి రెండు వేలకు పైగా ఉందనుకొంటాను' సరోజతో లాలనగా అన్నాను. నా ఉద్దేశానికి వేరే మాటలు అనవసరం. సరోజ సంగతి

గ్రహించింది.

"పెళ్లిళ్ళు అవీ అయి, ఎవరి సంసారాలు వాళ్ళు చూసుకొంటున్నప్పుడు - ఎవరి కష్టాలు వారికుంటాయి. మనకీ పిల్లలు పెరుగుతున్నారు. ఈ రెండు వేలూ కూడబెట్టడానికి రెండేళ్ళు పట్టింది" సరోజ కఠినంగానే అన్నది.

"అది కాదు సరోజా! అక్కయ్యకి ఈ డబ్బు చాలా అవసరం. నా తోడబుట్టిన దానికి ఈ మాత్రం సహాయం చెయ్యకపోతే ఎలా?"

"మనకి వేలకు వేలు మూలుగుతోంటే అనుకోవచ్చు. ఏదో రెండు పూట్లా నోట్లోకి వేళ్ళు వెళ్లుతున్నంత మాత్రాన మన దగ్గర మూటలు మూలుగుతున్నాయనుకొంటే ఎలా?" సరోజలో కఠినత్వం, ఇన్నేళ్ల వైవాహిక జీవితంలోనూ మొదటిసారిగా చూడగలిగాను.

"మనకి జరుగుతోంది కనకనే, ఈ మాత్రం సహాయం చెయ్యవచ్చుననుకొంటున్నాను! అక్కయ్య ఏమీ పరాయిది కాదు కదా?!" అనకూడని మాట అన్నాననుకొంటాను. సరోజ దృష్టిలో. విరుచుకుపడింది.

"అవును, నేనే పరాయిదాన్ని. అయినా ఆ డబ్బు మీది. మీ యిష్టం వచ్చినట్లు చేసుకోడానికి మీకు హక్కుంది. కాదనడానికి నేనెవర్తిని?"

సరోజ విసురుగా లేచి వెళ్ళిపోయింది.

"అమ్మా ఆకలేస్తోందే", అంటూ బాబిగాడు లోపలికి వచ్చాడు.

"వంటింట్లో బల్ల మీద పాలున్నాయి, తాగి తగలడు!" సరోజ సమాధానం పక్క గదిలోంచి వచ్చింది.

ఆడదాని స్వార్థాన్ని గురించి ఆలోచిస్తూ అలానే కూర్చుండిపోయాను, చాలాసేపు. ఏడింటికి చన్నీళ్ళతో హాయిగా స్నానం చేసి బట్టలు మార్చుకొన్నాను. డాబా మీదకు పోయి, సిగరెట్ ముట్టించి పచార్లు మొదలుపెట్టాను. కింద తులసికోట దగ్గర, బాబిగాడూ, శాంతా ఘర్షణ పడ్తున్నారు.

"ఆ బొంగరం నాది. నీకెందుకివ్వాలి?" బాబిగాడు తిక్కగా అన్నాడు.

"నాన్నగారు మనిద్దరి కోసం కొన్నారు. నాక్కూడా ఇవ్వు" శాంత దబాయిస్తోంది.

"నేనివ్వను. కష్టపడి పనిచేసినందుకు నేను సంపాదించిన బహుమతి ఇది."

"అక్కడికి నువ్వొక్కడివే కష్టపడి పోతున్నట్లు? ఏం చేశావేమిటి?"

"మొక్కలకి గొప్పులు తవ్వి నీళ్ళు పెట్టాను."

"అది కష్టమైన పనా?"

"లేకపోతే గచ్చకాయలాడ్డం - షికార్లు కొట్టడం.... కష్టం కదూ! రేపట్నుంచి ఒక్క పువ్వు కోసి చూడు, ఏం చేస్తానో?"

"రేపటిదాకా ఎందుకు? ఇప్పుడే కోస్తాను! ఏం చేస్తావో చూస్తాను!" శాంత

అక్కణ్నుంచి కదలబోయిందనుకొంటాను, ఏం జరిగిందో కాని, "అమ్మా చూడవే- తమ్ముడు వీపు మీద గుద్దుతున్నాడు!" అంటూ అరవడం మొదలుపెట్టింది. అక్కడే అరుగు మీద కందిపచ్చడి రుబ్బుతోన్న సరోజ పిల్లల్ని గదమాయిస్తోంది. "అలా దెబ్బలాడు కోకండి. అయినా బాబీ - అక్కని కొట్టడం తప్పు కాదురా? బొంగరం నీ కోసమే అయినా, అక్కకి కూడా యివ్వాలి. నువ్వు యివ్వకపోతే యింకెవరిస్తారు దానికి?"

"దాని మొగుడు!"

"అదెప్పుడో తర్వాత మాట. అయినా నువ్వు మరి దాని తమ్ముడివి కదా! నువ్వు కష్టపడి ఏం చేసి ఏం సంపాదించినా అక్కక్కూడా యివ్వాలి. అప్పుడది 'మా తమ్ముడెంత మంచివాడూ' అని పొంగిపోతుంది".

"ఇప్పటికెన్నిసార్లు పువ్వులు కోసుకోనిచ్చాను. ఒక్కసారైనా నేను మంచివాణ్ణని అనలేదు!"

"అదిప్పుడు బొంగరం కోసం సరదాపడ్తోంది కదా! బొంగరం దానికిస్తే సంతోషిస్తుంది. నువ్వింకొకటి కొనుక్కొందువుగాని" సరోజ బాబిగాణ్ని బుజ్జగించడం మొదలుపెట్టింది.

ఇదే అదనుగా శాంత స్థాయి హెచ్చిస్తూ ఏడవడం మొదలుపెట్టింది. బాబిగాడు కరిగి పోయాడనుకొంటాను. "ఏడవకే, ఇంద బొంగరం తీసుకో. రేప్పొద్దున్నకి రెండు గులాబీలు విచ్చుకొంటాయి. అవి కోసుకో".

చిన్నగా నవ్వుకొంటూ, మరో సిగరెట్ ముట్టించాను. సరోజ మీదకు బాణం వదలడానికి మరో అవకాశం దొరికిందనుకొన్నాను.

రాత్రి భోజనం వడ్డిస్తుంటే, 'నువ్విందాకా బాబిగాడికేదో హితబోధ చేసినట్లున్నావు!' అన్నాను, సరోజతో. నా మాటల్లోని వ్యంగ్యాన్ని గుర్తించలేనంత మూర్ఖురాలు కాదు సరోజ.

"మీ మాటల్లోని అర్థం తెలుస్తోనే ఉంది. బావుంది - సాయంత్రం భార్యగా మాట్లాడాను. ఇందాకా తల్లిగా మాట్లాడాను. ఇది యుగ ధర్మం!"

సరోజ సమాధానంలో చాలా పెద్ద పదాలే దొర్లాయి. అర్థాలే యిమిడాయి. అవాక్కయిపోయాను. బాబిగాడూ, శాంతా అర్థం కాక నా మొహంకేసి చూడసాగారు. మౌనంగా భోజనం ముగించాను.

అయితే సరోజ సమాధానంతో, నాకు జ్ఞానోదయమైంది.

ఆ మర్నాడు ఆఫీసుకు వెళ్ళగానే, ప్రావిడెంటు ఫండ్‌లోంచి మూడు వేలు అప్పు తీసుకొని అక్కకి పంపించాను. కట్టుకొన్న ఆడదానితో - చేయబోయే ప్రతి పనిని గురించి ఆలోచించాలనీ, చేసిన ప్రతి పని గురించి చెప్పాలనీ ఎక్కడా లేదు.

ఇదీ యుగధర్మమే!

('యువ' మాసపత్రిక : ఫిబ్రవరి 1976)